పల్లెల్లో పనులు కరవు

- యంత్రాలతోనే రబీ సాగు
- ప్రారంభమైన రబీ మాసూళ్లు


వరికోత కోస్తున్న యంత్రం

రామచంద్రపురం: ఒకప్పుడు రెండో పంట మాసూళ్లంటేనే రెండు నెలలకు పైబడి సాగుతుండేవి. కోతలు, కట్టీతలు, కుప్పనూర్పిళ్లు, ధాన్యం ఎగరబోతలు ఇలా రైతులు తీరుబడిగా రబీ పంట పనులు చేసుకుంటుండేవారు. కానీ ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితులు, అందుబాటులోకి వచ్చిన యాంత్రీకరణ పుణ్యామాని మాసూళ్లు ప్రారంభైన నెలలోపే రైతులు ధాన్యాన్ని అమ్మేసుకుని వచ్చిన కాడికి సొమ్ము చేసుకుంటున్నారు. రెండో పంటలో రెండు నెలలకు పైగా పనులు చేసుకుని గ్రామాల్లో కూలీలు కూలీ డబ్బులు తెచ్చుకునే వారు. కానీ యంత్రాలతో మాసూళ్ల వచ్చిన తరువాత వారికి పనులు లేకుండా పోయాయి.

పెద్ద ఎత్తున వరి కోత యంత్రాల రాక

నియోజకవర్గంలో ఈ సారి రబీ మాసూళ్ల సీజన్ ప్రారంభంలోనే పెద్ద ఎత్తున వరి కోత యంత్రాలు వచ్చాయి. కర్ణాటక, తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఒరిశా, తెలంగాణ రాష్ట్రాలతో పాటుగా ఏపీలోని నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి కూడా వరి మాసూళ్ల యంత్రాలు వచ్చాయి. ఏటా నియోజకవర్గంలోనిరామచంద్రపురం, కాజులూరు, కె.గంగవరం మండలాల్లో రెండో పంటలో 59 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తుంటారు. సాధారణంగా ఏప్రిల్ మొదటి వారంలో మాసూళ్లు ప్రారంభించి దాదాపుగా మే నెలఖారు వరకు సాగేవి. ఈ సారి సాగునీటి ఎద్దడి కారణంగా ఏప్రిల్ రెండో వారంలో కోతలు ప్రారంభించారు. ప్రారంభం నాటి నుంచి యంత్రాలతోనే రైతులు మాసూళ్లు చేస్తున్నారు. నియోజకవర్గంలోని 75 గ్రామాల్లో గల వరి పంట మాసూళ్లకు దాదాపుగా ఏటా 1000కి పైగా వరి కోత యంత్రాలతో మాసూళ్లు చేస్తున్నారు. గతంలో కోతలు కోసి కుప్పలు నూర్చి ధాన్యాన్ని ఇంటికి తీసుకువచ్చే సరికి ఒక ఎకరానికి రైతుకు సుమారుగా కూలీ రేట్లను బట్టి రూ.10 వేల నుంచి 15 వేల వరకు ఖర్చయ్యేది. ప్రస్తుతం యంత్రాలతో మాసూళ్లు చేస్తుండటంతో ఆ ఖర్చు తగ్గిందనే చెప్పాలి. ఎకరానికి యంత్రాల ద్వారా మాసూళ్లకు దాదాపుగా రూ.7 వేల నుంచి రూ.8500 వరకు ఖర్చవుతుంది. గత ఏడాది వరి కోత యంత్రానికి ఎకరానికి గంటకు రూ.2500 నుంచి రూ.2600గా తీసుకునే వారు. కాగా ఈ సారి రూ.2800 నుంచి రూ.3000కు పెంచేశారు. గ్రామాల్లో కూలీ పనులు చేసుకుని బతికే వారికి యంత్రాలు వచ్చి గండి కొట్టాయి. దాదాపుగా రెండు నెలల పాటు వ్యవసాయ పనులు చేసుకునే వారు. సీజన్ ప్రారంభంలో ఒక్కొక్కరికి రూ.500 నుంచి రూ.700 వరకు రోజు కూలీ దక్కేది. ప్రస్తుతం కోతలు, కుప్పనూర్పిళ్లు లేకపోవటంతో కూలీలకు పనులు కరువయ్యాయి. కేవలం యంత్రాలతో నూర్చిన ధాన్యాన్ని ఎండబెట్టుకునేందుకే కూలీ పనులకు వెళ్లాల్సి వస్తుంది. అదీ ఎకరానికి ఇద్దరు కూలీలు రెండు రోజులు పాటు మాత్రమే ధాన్యాన్ని ఎండబెట్టేందుకు పనిచేస్తున్నారు. ఏటా వరికోత యంత్రాలు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పనులు తగ్గుతూ వస్తున్నాయి. దీంతో కూలీలు ప్రత్యామ్నాయాన్ని వెతుక్కోవాల్సి వస్తుంది.

తొంభై శాతానికిపైగా యంత్రాలతోనే



ఈ సారి నియోజకవర్గానికి పెద్ద ఎత్తును యంత్రాలు తరలివచ్చాయి. దీంతో పనులు త్వరగా అయ్యిపోయి, రబీలో అనుకున్న విధంగా దిగుబడి రాకపోవటం, గిట్టుబాటు ధర కూడా లేకపోవటంతో తగ్గిన మాసూలు ఖర్చులు కొంతలో కొంత కలిసి వచ్చినట్లే..

– గుణ్ణం రామకృష్ణ, రైతు, కొత్తూరు

ఏటా పనులు తగ్గుతున్నాయి



యంత్రాలు రావడంతో రెండో పంటలో ఏటా పనులు తగ్గుతూనే వస్తున్నాయి. ఇవరై రోజుల్లో మొత్తం పనులు పూర్తయిపోతున్నాయి. కూలీల్లో సగానికి పైగా పనులు ఉండటం లేదు. దీంతో వేరే మార్గాల్లో పనులు చూసుకోవాల్సి వస్తుంది.

– ద్వారంపూడి సోమిరెడ్డి, బంధనపూడి

క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ


పడమర ఖండ్రిక రామాలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: ఆలయాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు తార్కాణాలుగా నిలుస్తాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. పడమర ఖండ్రికలో నూతనంగా నిర్మించిన రామాలయంలో ఆదివారం స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. గ్రామంతో పాటు అంగర, పడమర ఖండ్రిక, టేకి, నల్లూరు, కపిలేశ్వరపురం తదితర గ్రామాల భక్తులు పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు


యానాం-ద్వారపూడి రహదారిలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఎస్సై మోహన్‌కుమార్

కాజులూరు: మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ ఎస్సై ఎం.మోహన్‌కుమార్ అన్నారు. ఆదివారం యానం, ద్వారపూడి రహదారిలో మండలంలోని కోలంక వద్ద ఎస్సై మోహన్‌కుమార్, స్టేషన్ సిబ్బంది డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఆయన ప్రయాణికులతో మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలను నడపటం వలన వారికే కాకుండా రోడ్డుపై వెళ్లే వారికి ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ప్రయాణికులు రోడ్డుపై వెళ్లే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

శక్తి గణపతికి ప్రత్యేక పూజలు


ర్యాలి శక్తిగణపతి ఆలయంలో గులాబ్‌జామ్ కాయలతో పూజ

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి కాశీ అన్నపూర్ణ విశాలాక్షి సమేత విశ్వేశ్వరపుత్ర శక్తి గణపతి ఆలయంలో ఆదివారం సహస్ర రెడ్ ఆపిల్స్ (ఎర్ర గులాబ్‌జామ్ కాయలు) తో పూజ నిర్వహించారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని భగవంతుని కోరుతూ ఆ గ్రామానికి చెందిన ఆలయ కమిటీ అధ్యక్షుడు చింతా సూర్యచంద్రరావు కుటుంబం గ్రామంలో శివ, కేశవ ఆలయాల నడుమ వేంచేసియున్న కాశీ అన్నపూర్ణ విశాలాక్షి సమేత విశ్వేశ్వరపుత్ర శక్తి గణపతి ఆలయంలో ఈ పూజలు నిర్వహించారు. ప్రముఖ ఇంద్రజాలికుడు చింతా శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయం అభివృద్ధికి విరాళం

ఆలమూరు: మండలంలోని కలవచర్లలో ఇటీవల పునర్నిర్మించిన శెట్టిబలిజ రామాలయం అభివృద్ధికి రూ.25 వేల విరాళం అందింది. గ్రామానికి చెందిన వడ్డి మణిబాబు, వెంకటలక్ష్మి దంపతులు తమ మనవడు రామ్‌వెంకట షణ్ముఖ మొదటి పుట్టినరోజు పురస్కరించుకుని ఆ విరాళాన్ని నగదు రూపంలో ఆదివారం ఆలయ కమిటీకి అందజేశారు. అనంతరం మణిబాబు కుటుంబసభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అనారోగ్య బాధితురాలికి సాయం


దుర్గారావుకు సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితురాలి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు ఆదివారం రూ.11,500 నగదు సాయంగా అందజేశారు. మండపేట మండలం ఇప్పనపాడుకి చెందిన మాసిన ఆదిలక్ష్మి (33) రెండు కిడ్నీలు పాడైపోయి కిడ్నీ మార్పు కోవాలని డాక్టర్లు చెప్పారు. కిడ్నీ మార్పిడి జరిగే వరకు డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితి. రైస్ మిల్లులో పని చేసుకునే ఆమె భర్తకి అంత ఆర్థికస్తోమత లేక స్థానిక కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో ఆదిలక్ష్మి భర్త మాసిన వీర వెంకట దుర్గారావుకి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.11,500 చెక్కు సాయంగా అందజేశారు.

భీమేశ్వరుని సన్నిధిలో యానాం ఎమ్మెల్యే


ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ఎమ్మెల్యే అశోక్ కుటుంబ సభ్యులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి అశోక్‌కుమార్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం బేడా మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. ఈఓ వారికి స్వామివారి తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

కపిలేశ్వరపురంలో నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కపిలేశ్వరపురం: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.రత్నకుమారి ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హాజరవుతారన్నారు. వివిధ శాఖల అధికారులు ప్రజా సమస్యలపై అర్జీలను స్వీకరిస్తారని ఎంపీడీఓ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వరం

- డిజిటల్ లిటరసీ, సైబర్ సేఫ్టీ, కోడింగ్, రోబోటిక్స్, ఏఐలపై సమ్మర్ క్యాంపు
- నెల రోజుల పాటు ప్రత్యేక శిక్షణ పూర్తి ఉచితం

రామచంద్రపురం రూరల్: ఢిల్లీకి చెందిన లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఎస్‌సీహెచ్ఐ (సోలార్ కమ్యూనిటీ హబ్స్ ఇండియా) పేరుతో డెల్ టెక్నాలజీ సంస్థ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు డిజిటల్ లిటరసీ, సైబర్ సేఫ్టీ, కోడింగ్, రోబోటిక్స్, ఏఐలపై 30 రోజుల పాటు సమ్మర్ క్యాంపు నిర్వహించనున్నారు. ఈ ఐదు అంశాలకు సంబంధించి రోజూ ఒక గంట పాటు ప్రత్యేక క్లాసులు ఆన్‌లైన్ ద్వారా నేర్పిస్తారు. డిజిటల్ లిటరసీలో కంప్యూటర్, ఇంటర్నెట్‌లను ఉపయోగించే విధానం, ప్రయోజనాలు, ఎంఎస్ ఆఫీస్ (ఎక్స్ఎల్, పవర్ పాయింట్, వర్డ్)లను క్షుణ్ణంగా నేర్పిస్తారు. సైబర్ సేఫ్టీలో సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారు. కోడింగ్‌లో స్క్రాచ్ అప్లికేషన్ ద్వారా గేమ్స్‌ను డెవలప్ చేయడం తదితర కోడింగ్‌లు చేయడం నేర్పిస్తారు. రోబోటిక్స్‌లో బ్లాక్ కోడింగ్ ద్వారా రోబోటిక్స్‌ను తయారు చేయడంపై శిక్షణ ఇస్తారు. వీటితో పాటు అన్ని రంగాల్లోనూ ఎంతో ప్రాముఖ్యత కనబరుస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను నేర్పిస్తారు.


రామచంద్రపురం చాకలిపేట మున్సిపల్ హైస్కూల్‌లో జరుగుతున్న బోధన

కోర్సుల్లో ఎలా చేరాలి..

ఈ సమ్మర్ కోర్సులో చేరాలనుకునేవారు కచ్చితంగా ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ కళాశాలలకు చెందిన వారై ఉండాలి. ఆయా పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌ల అనుమతి ఉండాలి. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఫోన్ నంబరు 94940 24013పై సంప్రదించాలి.

విద్యార్థులకు ఎంతగానో ఉపయోగం



విద్యార్థులకు ఈ ఐదు అంశాలు నేర్చుకోవడం ఎంతో ఉపయోగకరం. వారికి లాజికల్ థింకింగ్ అభివృద్ధి చెందుతుంది. ఏఐ సహకారంతో పరీక్షలకు సిద్ధం కావడం చాలా సులభం అవుతుంది. చిన్న వయస్సులోనే భవిష్యత్తును శాసించబోయే టెక్నాలజీలను వారు నేర్చుకోవడం ద్వారా అన్ని రంగాల్లోను ముందంజలో ఉంటారు.

– వెన్నా భరత్, అసిస్టెంట్ మేనేజర్, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్

అండ్రంగి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి


అండ్రంగి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలంటూ ఫ్లెక్సీలు అతికిస్తున్న రాజబాబు

కాజులూరు: గొల్లపాలెం, యానం రహదారిలో మండలంలోని కాజులూరు, దుగ్గుదుర్రు గ్రామాల మధ్య అండ్రంగి డ్రెయిన్‌పై శిథిలావస్థలో ఉన్న వంతెన నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. ఆదివారం వంతెన పరిసర ప్రాంతాల్లో ఫ్లెక్సీలు అతికిస్తూ వంతెన పరిస్థితిపై రాజబాబు తదితరులు నిరసనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవటంతో గత ఐదేళ్ల క్రితం అధికారులు రాకపోకలు నిలిపివేసి వంతెన పక్కనే తూములతో కాజ్‌వే నిర్మించారన్నారు. మండలంలోని సగం గ్రామాలు వంతెన అవతల వైపు, సగం గ్రామాలు వంతెన ఇవతలి వైపు ఉన్నాయని అటునుంచి ప్రజలు ఇటు రావాలన్నా, ఇటు నుంచి ప్రజలు అటు వెళ్లాలన్నా ఈ వంతెనపై నుంచే ప్రయాణాలు సాగించాలన్నారు. వంతెన శిథిలావస్థకు చేరుకుని కాజ్‌వే పై ప్రయాణం చెయ్యటం వలన వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయని, ప్రస్తుతం మాసూళ్ల సమయం కావటంతో ధాన్యం తదితర పంట ఉత్పత్తులు తరలించేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు గురికావలసి వస్తుందన్నారు. కాజ్‌వే కారణంగా డ్రెయిన్‌లో నీరు ముందుకు కదలక భారీ వర్షాల సమయంతో డ్రెయిన్‌ను ఆనుకుని ఉన్న సుమారు ఐదు వేల ఎకరాలు పంట ముంపుబారిన పడుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి త్వరితగతిన వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు.

శాంతితోనే ఎదుటి వారిని జయించాలి

- రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్
- ఘనంగా ఈస్టర్ వేడుకలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు


పసలపూడి కళానగర్ చర్చిలో వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న డీఎస్పీ రఘువీర్ తదితరులు


అంగరలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

రాయవరం: శాంతి ద్వారా మాత్రమే ఎదుటి వారిని జయించాలని, ఇదే ఏసుక్రీస్తు ప్రపంచానికి ఇచ్చిన సందేశమని రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ పేర్కొన్నారు. మండలంలోని పసలపూడి కళానగర్‌లోని శ్రీఏసు కరుణాలయం బాప్టిస్టు చర్చిలో ఈస్టర్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ రఘువీర్ మాట్లాడుతూ ఎదుటివారిని క్షమించడంలోనే ఆనందం పొందాలని లోక రక్షకుడైన ఏసుక్రీస్తు చెప్పిన మాటలు అక్షర సత్యాలు అన్నారు. రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపిన బాటలో ప్రతిఒక్కరూ పయనించాలన్నారు. చర్చి పాస్టర్ ఎస్.దీవెనకుమార్ మాట్లాడుతూ సర్వజనుల పాపాలను హరించడానికి వచ్చిన దైవ కుమారుడిని గుడ్‌ఫ్రైడే రోజున కొందరు చిత్రహింసలకు గురి చేసి కల్వరి కొండపై శిలువ వేశారని, అయినప్పటికీ మూడో రోజైన ఆదివారం ఏసుక్రీస్తు మరణాన్ని జయించి సజీవుడై తిరిగి వచ్చాడన్నారు. అనంతరం పారిశ్రామికవేత్త చైతన్య రాజబాబు సౌజన్యంతో వృద్ధులు, వితంతువులకు చీరలు, కళానగర్ యూత్ మహిళలకు నూతన వస్త్రాలను డీఎస్పీ రఘువీర్, ఎస్సై సురేష్‌బాబుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో రామచంద్రపురం వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కర్రి వెంకటరెడ్డి, స్థానిక నేత పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండలంలో పలు చర్చిల్లో ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చర్చిల్లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఏసుక్రీస్తు జన్మదిన వృత్తాంతాన్ని తెలిపే నాటికలను ప్రదర్శించడంతో పాటు ప్రత్యేక ప్రార్థనా గీతాలను ఆలపించారు. మండలంలోని రాయవరం, లొల్ల, వెదురుపాక, వి.సావరం, నదురుబాద, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కురకాళ్లపల్లి, కూర్మాపురం గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఘనంగా ఈస్టర్

కపిలేశ్వరపురం: మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్‌ను ఘనంగా నిర్వహించారు. అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, తాతపూడి, వెదురుమూడి, నేలటూరు, వల్లూరు, నిడసనమెట్ట, వడ్లమూరు, అచ్యుతాపురం, కాలేరు, నల్లూరు, టేకి, మాచర, కోరుమిల్లి, నాగుల చెరువు, వాకతిప్ప అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లో క్రైస్తవ భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పూర్వీకుల సమాధులు వద్ద కొవ్వొత్తులు వెలిగించి వారి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. చర్చిల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రేమవిందు ఆరగించారు.

మండపేటలో...

మండపేట పట్టణం, రూరల్ మండలంలోని 12 గ్రామాల్లో క్రైస్తవ సోదరులు వారి పూర్వీకుల సమాధులను పూలతో అలంకరించారు. వీధుల్లో ఈస్టర్ ప్రాధాన్యతను వివరిస్తూ కీర్తనలు పాడుతూ ఊరేగింపు నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

నూకాంబిక ఆలయంలో భక్తుల సందడి

ఆలమూరు: చింతలూరు నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థోత్సవాలకు సంబంధించి భక్తుల తాకిడి కొనసాగుతుంది. అమ్మవారి తీర్థోత్సవాలు ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా భక్తుల తాకిడి ఏమాత్రం తగ్గలేదు. ఉభయగోదావరి జిల్లాల నుంచి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయానికి భక్తుల తాకిడి అధికం కావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని నూతన వస్త్రాలు, పసుపు కుంకుమలు సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు.

వైభవంగా లక్ష రుద్రాక్షార్చన


లక్ష రుద్రాక్షార్చనలో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు: మొగలికుదురులోని జగ్గన్నపేటలో కొలువుదీరిన భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయంలో చైత్ర బహుళ సప్తమి ఆదివారం లక్ష రుద్రాక్షార్చన మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. హర హరా అంటూ భక్తులు శివనామ స్మరణ చేస్తుండగా ఈ పూజని అర్చక స్వాములు వైభవంగా జరిపించారు. బ్రహ్మశ్రీ కారుపర్తి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో లక్ష రుద్రాక్షార్చన, రుద్రహోమం, అమ్మ వారికి కుంకుమార్చన పూజలను ఘనంగా జరిపించారు. దీనిలో భాగంగా స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలను వేద మంత్రాలతో రమణీయంగా జరిపించారు. పలువురు భక్త దంపతులు ఈ పూజల్లో కర్తలుగా పాల్గొన్నారు. పూజల అనంతరం అర్చకుల నుంచి వేద ఆశీర్వచనం అందుకున్నారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

ఖేలో ఇండియాకు విద్యార్థుల ఎంపిక

మలికిపురం: మండలంలోని గుడిమెళ్లంక పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు ఎంపికయ్యారు. ఈనెల 16న భీమవరం హైస్కూల్లో జరిగిన 7వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ మాల్‌ఖంబ్ రాష్ట్ర స్థాయి సెలక్షన్ ట్రయల్స్‌లో సదరు విద్యార్థులు ఎంపికయ్యారు. వివరాలు వ్యాయామోపాధ్యాయుడు బి.రాధాకృష్ణ, ప్రధాన ఉపాధ్యాయుడు పుట్టా సత్యవెంకట సుబ్బారావు తెలిపారు. 10, 9, 7వ తరగతి విద్యార్థులు కె.బ్రైటేష్, కె.తనూజ్, కె.దేవి పై పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి మే 2 నుంచి బిహార్‌లో జరిగే ఖేలో ఇండియా యూత్ గేమ్స్ పోటీలకు అర్హత సాధించినట్టు వారు తెలిపారు. ఎంపికై న వారిని ఎంఈఓ ఎం.విజయశ్రీ, అల్లూరి కృష్ణరాజే, స్థానికులు అభినందనలు చెప్పారు.

ఇరుకు రోడ్డుతో ఇక్కట్లు

- విస్తరణకు నోచుకోని కపిలేశ్వరపురం – అంగర రహదారి
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు


విస్తరణకు నోచుకోని కపిలేశ్వరపురం-అంగర రహదారి

కపిలేశ్వరపురం: మండల కేంద్రమైన కపిలేశ్వరపురం – అంగర ఆర్అండ్‌బీ రహదారిని విస్తరించాలని ప్రజలు కోరుతున్నారు. మండపేట నుంచి అంగర వరకూ గతంలో విస్తరించారు. అక్కడ నుంచి నాలుగు కిలోమీటర్లు మేర ఉన్న అంగర–కపిలేశ్వరపురం రహదారి విస్తరణ పనులు అప్పట్లో నిలిచిపోయాయి. దీంతో మండల కేంద్రమైన కపిలేశ్వరపురంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. ఈ రహదారి మీదుగా మండపేట, కొత్తపేట, రామచంద్రపురం నియోజకవర్గాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇసుక, ఇటుక, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను తరలించే వాహనాలతో నిత్యం రద్దీగా ఉండే రహదారి కావడంతో త్వరితగతిన విస్తరణ పనులను చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

2016లో..

2016లో కపిలేశ్వరపురం– మండపేట రహదారి విస్తరణ పనులు చేపట్టారు. 16.2 కిలోమీటర్లు మేర 3.5 మీటర్లు వెడల్పుతో ఉన్న రహదారిని ఏడు మీటర్లకు వెడల్పు చేసేందుకు ఆ రోజుల్లో రూ.16.03 కోట్లు నిధులు మంజూరయ్యాయి. 11 కిలో మీటర్ల మేర తారు, 3.2 కిలోమీటర్లు మేర సీసీ రోడ్డుగానూ మెరుగుపర్చారు. నిధుల సర్దుబాటు కారణంగా 14.2 కిలోమీటర్లు మేరకు మాత్రమే పనులు చేపట్టారు. దీంతో 1.7 కిలోమీటర్లు మేర కపిలేశ్వరపురం–అంగర రహదారి విస్తరణ పనులు నిలిచిపోయాయి.

ప్రయాణికుల ఇబ్బందులిలా..

19 గ్రామాలకు మండల కేంద్రంగా కపిలేశ్వరపురం ఉంది. ప్రభుత్వ కార్యాలయాలన్నీ కపిలేశ్వరపురంలో ఉండటంతో ప్రభుత్వ ఉద్యోగులు, కార్యాలయాలకు వెళ్లే సందర్శకులతో నిత్యం రహదారి రద్దీగా ఉంటుంది. కపిలేశ్వరపురంలోని ఐసీడీఎస్ కార్యాలయానికి వందల మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు వచ్చి వెళ్తుంటారు. కపిలేశ్వరపురంతో పాటు మండపేట, రాయవరం మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ నియోజకవర్గ కేంద్రమైన మండపేట నుంచి పర్యవేక్షించాల్సి ఉన్నప్పటికీ సరైన కార్యాలయం అందుబాటులో లేకపోవడంతో కపిలేశ్వరపురంలోని ఐసీడీఎస్ కార్యాలయం నుంచే అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కపిలేశ్వరపురంలోని సీహెచ్‌సీ ఆసుపత్రికి నేలటూరు, వల్లూరు, వెదురుమూడి, టేకి, నల్లూరు, అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రజలు అంగర–కపిలేశ్వరపురం రహదారి మీదుగా వెళ్తుంటారు. తాతపూడి, కపిలేశ్వరపురం ర్యాంపుల నుంచి ఇసుక లారీలు ఈరహదారి మీదుగానే రాకపోకలు సాగిస్తున్నాయి. కపిలేశ్వరపురం, వెదురుమూడి, అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లోని బట్టీల నుంచి ఇటుక వాహనాలతో రహదారి రద్దీగా ఉంటోంది. వ్యవసాయ ఉత్పత్తులు తరలించే వాహనాలతో పాటు అంగర, ఆలమూరు, మండపేట, రామచంద్రపురం పట్టణాల్లోని విద్యాలయాలకు చెందిన వాహనాలు ఈ రహదారి మీదుగా వెళ్తుంటాయి. ఇంతటి ప్రాధాన్యతగల కపిలేశ్వరపురం–అంగర ఆర్అండ్‌బీ రహదారిని త్వరితగతిన విస్తరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు



మండపేట నుంచి కపిలేశ్వరపురం వరకూ విస్తరణ పనులు చేపడతామంటూ 2016లో విస్తరణపనులు చేపట్టారు. మండపేట నుంచి అంగర శివారు వరకూ విస్తరించి ఊరుకొన్నారు. మండల కేంద్రమైన కపిలేశ్వరపురం గ్రామం వరకూ విస్తరణ పనులు లేకపోవడంతో ప్రయాణికులు, ప్రభుత్వ కార్యాలయాల సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారిని విస్తరించాలి.

పీతల బంగారం, కపిలేశ్వరపురం